



పురాణం
సుబ్రహ్మణ్యశర్మ

(గత సంచిక తరువాయి)



**తలుపు కాస్త కిర్రుమంది. టక్కు టక్కుమనే చప్పుడు చెవి దగ్గరలోకి వచ్చి ఆగినట్లే వుంది. దాని వెంబడిని తలుపు రెక్క మీద ఎవరో నీరసంగా చేయి ఆన్చినట్లు కూడా వేసింది నాకు అనుమానం.**

'బాబుగారూ!' అన్న పిలుపు- తగులబడిపోతున్న ఒక మహా వృక్షం నెమ్మదిగా నా మీదకు వొరుగుతున్నట్లే ఫీలయ్యాను. నా గుండెల మీద కురికి నిలచిన ఆ ఒక్క మధుర స్మృతి కూడా నాకు దక్కదేమోనన్న భయం లోపల విపరీతంగా వేధిస్తోంది. అయిష్టం తోటే, బలవంతాన ఎవరో త్రోసినట్లుగా వెళ్ళి తలుపు గెడ తీశాను. ఏం చెప్పను?

నా గది గడప వద్ద ఎర్ర పావడా పూల వోణీ 'నీలి' కుప్పలా చతికిలబడి వుంది. డొక్కలో కాళ్ళు తన్ని పెట్టుకుని తోకను కొరుక్కుంటూ హోటళ్ళలో బల్లక్రింద పడుకునే దిక్కుమాలిన కుక్క జ్ఞాపక మొస్తోంది.

నీలి తన మెలితిరిగిన కాలు మడతవేసి ఆ వూత కర్రను నేలమీద ఒక చేత్తో త్రోసుకుంటూ రెండవ చేత్తో వూడుస్తున్నది. ఆమె ఆ విధంగా దేకుతున్నప్పుడు తన మోకాళ్ళను దాటి పరికిణీ వెనక్కు పోకుండా మధ్యను ఆగి కప్పుకొంటున్నది. చూస్తే మనిషిలో ఎముకలూ, ఆ బొమికెలను కప్పేందుకు గాను చర్మము తప్ప మరే విధమైనటువంటి మృదువైన మెత్త పల్లాలు కనీసం మచ్చుకైనా దొరకని ఆమె 'మానం' పట్ల అంత అభిమానం కనపర్చటం నిజంగా నాకు ఆశ్చర్యాన్నే కలిగించింది.

తలలో వున్న ఆ పది పరకల జుత్తులోనూ ఒక ఎర్రగన్నేరు పువ్వు తురిమింది. ఆ కాలు యీడ్చుకుంటూ వసారా అంతా తాబేలులా తుడుచుకొస్తున్నది. మెడమీద నుంచి కారుతున్న చెమటను పవిట చెరుగుతో వొత్తుకుని, లోతుకు దించుకునిపోయిన కళ్ళతో ముఖమెత్తి 'గది వూడుస్తాను బాబూ!' అంది.

చాలా లేత ముఖమే- పధ్నాలుగు పదిహేనేళ్ళకు మించి వుండకపోవచ్చు.

ఆ అవకరపు మనిషి ముఖం నా మనస్సంతా కలచి వేస్తున్నది. నా ఎదురుగా కుప్పలా చతికిల బడింది. నేను పీలుస్తున్న గాలే తనూ పీలుస్తున్నది. ఇక నాకు సంబంధించిన ప్రతి వస్తువూ ముట్టుకుని నా దైనిక జీవితంలోనికి అనవసరంగా తొంగి తొంగి చూస్తూ నన్ను మానసిక వ్యథపాలు చేసేలాగుంది. నాకు కోపంలా వచ్చి అనేశాను - 'ఛట్! వీల్లేదు. ఆ చీపురిల్లాగియ్యి. యిస్తే నేనే తుడుచుకుంటాను రోజూ...'

కసిరినందుకు అభిమానంతో తలకాయ వ్రేలా దేసుకుని దేకుతూ నీలి మెట్ల వైపు కదలడం చూశాను. ఈ రోకలిబండలా ప్రాకే ఎముకల కుప్పను రెండు చేతులా యెత్తి మళ్ళీ యీ ఛాయలకు రాకుండా విసిరెయ్యగలిగితే - అసహ్యంతో నిండిపోయిన నా మనస్సు ఎంత త్వరలో యిక్కడ్నుంచి బైటపడి మరో హోటలు చూసుకోగలిగితే అంత మంచిదిలా తోచింది. చెప్పానుగా - బహు బద్ధకస్తుడ్ని... ఐతే ప్రపంచంలోని వికారమైన మనుష్యులతో జట్టీలు పెట్టుకుందుకు గాను నేను - అందమైన వాళ్ళకే యీ భూమి మీద జీవించటానికి హక్కు వున్నట్లుగా చెప్పాలనీ నాకు లేదు. కాని ఒక చిత్రమైన స్థితిలో నన్నేదో మనోవ్యధల్లో ముంచే యీ ముఖాల నుండి తప్పకుని బ్రతకాలనే యోచనే

'నీలి' కథకి 35 సంవత్సరాలు వచ్చినా 'నీలి' మాత్రం నీలి మేఘాల స్పర్శలా మనస్సుని సమ్మోహ పరిచే కథా కన్యగానే మిగిలింది.



...శా నా మామయ్య ప్రవృత్తి అనాగ్రహిక్కేమ్నా
...ప్పి వుండవమ్ను.
...ఉంటే డ్యూటీ మానుకోవటం, లేకపోతే
...పూరంతా చాంద్రాయణం చేసేవాణ్ని. గది
...తాళాలు కూడా హోటలు కుర్రాడి ముఖాన
పారేశాము. ఎప్పుడన్నా తోస్తే రెండు మెతుకులు
కొరికేవాణ్ని. లేని రోజున ఆ పళ్ళెం అట్లానే వాకరు
కుర్రాడు పట్టుకెళ్ళిపోయేవాడు. క్లబ్బులో పేట్లాట
రోజా జేబు ఖాళీ కావటం- దాన్తో విరాకుగా
...కోపంగా వుండాల్సి వచ్చేది. ఆరోగ్యమంటే యింత
లక్ష్యం లేకుండా యెందుకు ప్రవర్తించానో నాకే
అర్థం కాలేదు. చాలా రోజులకి మళ్ళీ అర్థం ముందు
...హూర్చున్నాము. బుర్ర కుతకుతా వుడికిపోతున్నట్లు
...ది. తలవిండా దుమ్ము... కళ్ళు గూడా
గుంటలువడి లోతుకు దించుకుపోయాయి. గడ్డం
తడుముకునేసరికి టెంకాయ పీచులాగా గరుకుగా
తగిలింది.

ఇన్నాళ్ళకు ఆ రోజు నాకు తలపు. ఎక్కడకూ
వెళ్ళటానికి వంట్లో నాకు శక్తిలేదు. సిగరెట్లు తెగ
కాలుస్తున్నానేమో ఖళ్ళుఖళ్ళుమని దగ్గు కూడా



వస్తోంది. ఈ దగ్గు ఒక ప్రక్కనుంచి ప్రాణాలు
తోడేస్తూంటే ఆ రాత్రి భయంకరంగా గడిపాను.
కడుపులో యేమీ యిమడ్డం లేదు. రెండు
మార్లు తిన్నదీ త్రాగినదీ అంతా నిద్రలో కక్కేసు
కున్నాను. నోరంతా అసహ్యంగా మారింది. బట్టలు
కుళ్ళు వాసన గొడ్తున్నాయి. గొడ్డళ్ళతో బాదినట్లు

తలనొప్పి - నో రాత్రివేళ జ్వరం వ్రరువ త్రాము
పాములా లేచింది. రోగానికి లొంగిపోయి దిగ్గరగా
యేడ్చేశాను. మళ్ళీ నాకు తెలివి వచ్చేసరికి మాస్తే
భళ్ళున తెల్లవారింది. నా పక్కన మునెమ్మ గారు
కూర్చుంది.

'భయంలేదు నాయనా!' ఆవిడ నా మీద చేస్తో
నిమురుతూంటే, నేను రెండు చేతులా ముఖం
కప్పేసుకున్నాను. మళ్ళీ ఆవిడే అందుకున్నది -

చెప్పేవాళ్లు లేక గాని నీ వంటి పిల్లవాడ్ని అదు
పాజ్ఞలో పెట్టుకోరూ?- యింత విచ్చలవిడిగా యిష్ట
మొచ్చినట్లు ఆరోగ్యం పాడుచేసుకోనిస్తుందీ?
చేసుకున్న పెళ్ళామే ఐతే...'

ప్రేళ్ళ సందుల్లోంచి చూస్తున్నాను. నేను కక్కి...
పోసిన స్థలమంతా బూడిద చల్లి శుభ్రంగా కడిగి యెత్తి...
పోస్తున్న ఎర్రపాపడా నీలి ప్రత్యక్షమైంది. వెంట...
తలెత్తి - 'ఆ పిల్ల ఠక్కుడ పారెయ్. నీకు ఎన్ని సా...
చెప్పాను నా గదిలో కాలుపెట్టవద్దని... పో...
పోవా ముందు. పో ...'

తను నా మాటల్ని విననట్టే, తలకాయ వాల్చుకుని నీలి తన పని తాను చేసుకుపోతున్నది.

'ఛీ! ఆ మొండితనం చూడండి.'

ముసలమ్మగారు నవ్వి 'అదే రాత్రి మెల్లగా కుంటుకుంటూ వచ్చి నన్ను లేపింది. ఆ క్రొత్తగా వచ్చిన బాబుకి వంట్లో బాగులేనట్లుంది, వెళ్ళి చూడమ్మా అని.'

నేను వెలవెలబోతూ అడిగాను. 'నీలి మీ అమ్మాయీ?' అని. నాకు తల గిర్రున తిరిగినట్లయింది.

'అవున్నాయనా, ప్రపంచంలో యిన్ని రకాల ముఖాల వాళ్ళున్నారు గదా- మా నీలిని చూస్తే యెందుకు నాయనా నీ కంత కోపం?'

ఇల్లా అమాంతం నా మంచం యెగిరి ముక్కూ మొగం తెలియని చోటికెళ్ళి పడకూడదా అనిపించింది. ఆవిడ అనవసరంగానే ఐనా ఒకమారు చెరగుతో కళ్ళ నొత్తుకుని మరీ చెప్పింది- నా దరిద్రం కాలిపోను? దబ్బవుతుందిటకాని కాలు మాత్రం మళ్ళీ వస్తుంది. కోసి సరిచేస్తామన్నారు డాక్టర్లు.'

నాకు లోలోపల 'ఆ సహాయం మీకు నేను చేయిస్తాను' మీ నీలికి కాలు తెప్పిస్తాను అని అనాలనుంది.

కాని నోరు పెగల్చలేకపోయాను. మళ్ళీ నన్ను నేను తిట్టుకున్నాను. ఏ నిన్నో మొన్నో యీ హోటలు మంచి మకాం యెత్తేసినా బాగుండిపోయేది. కురూపినై ముఖాన్ని లోకానికి చూపించవచ్చుగానీ, కృతఘ్నుడనై చూపడానికి యిష్టంలేక దుప్పటి తలంతా లాక్కున్నాను. జ్వరం కన్నా అభిమానం యెక్కువై ఆ రోజల్లా మంచం దిగలేదు. రాత్రి పదిగంటల వేళ ఒక అఘాయిత్యం తలబెట్టాను. అంతవరకూ లేని ధైర్యం చొరవ అప్పుడు నాకెక్కడ్నుంచి వచ్చిందో లేచి మెట్లు దిగి బయటి వీథిలో కొచ్చేశాను. నాలుగు రిక్షాలను చెప్పి వాళ్ళను వచ్చి హోటలు బైట నిలబడమన్నాను. తరువాత గొడవచేయకుండా నొకరి వెంటొకర్ని నెమ్మదిగా మెట్లెక్కి మేడ మీదకు రమ్మన్నాను. లోపల నాకు నీరసంగానే వుంది. గదిలో సామానంతా వాళ్ళచేత సర్దించి సడీ చప్పుడు లేకుండా ఖాళీ చెయ్యాలనీ, మిగతా లావాదేవీలు బయట మంచి సర్దచ్చు అనుకున్నాను. ప్లాను అద్భుతంగా మట్టుకు వుంది. కాని ఆచరణలో అది కాస్తా బట్టబయలై నవ్వుల పాలయ్యాను.

అంతవరకూ నా గది దగ్గర కాపలాకు మనిషి పడుకున్నారనే నాకు తెలియదు. రిక్షా వాళ్ళు పైకి వచ్చారు. గదిలో సామానులు సర్దిస్తున్నాను.

"ఏమిటి చేస్తున్నారుమీరు?' అంటూ తలుపు త్రోసుకుని కుంటికాలితో ప్రత్యక్షమైంది నీలి. నాకు ఉక్రోషం వచ్చిన మాట నిజమే- పళ్ళు పటపటా పిందుకున్నాను. నన్నిలా అటకాయించే ధైర్యమా? - ఎట్లా వచ్చింది? నీలి వికారంగా నవ్వుతూ అంది.

'ఇంతకీ నాకు మెలకువొచ్చింది గనుక సరిపోయింది. ఈయన్ని యెక్కడకు చేరేద్దామని వచ్చార్రా మీరు నలుగురూ? జబ్బు మనిషని ముఖం చూస్తే తెలవటంలే... ఫోండి, ఫోండి నిన్న రాత్రల్లా ఆయన నొళ్ళే ఆయనకు తెలీదు.'

ఆ రిక్షావాళ్ళు నలుగురూ కొరకొరా నాకేసి చూశారు. అందులో ఒకడు 'నోరి పిచ్చోడు.. గావల్నురా యీడు - మాకు తెల్దు తల్లీ! ఈ బాబు మాటల్ని నమ్మి గాడిలో నాక్కొల్లినాముగాం. ప్రొద్దుట్నే పోలీసోరు మక్కెలిరగ దన్నేసేవోరు.




పదండ్రా మా గొప్ప బేరనే...'

తిరిగి వాళ్ళు నాకు చెప్పుకునే అవకాశం లేకుండా జారుకున్నారు. నేను నిలువునిలువునా కోపంతో దహించిపోతున్నాను. పిచ్చివాణ్నా నేను? ఎదురుగ్గా అసహ్యమైన ముఖమేసుకుని భయం కూడా లేకుండా నవ్వుతోంది. చెంపలు తడుముకుంటే గరుగ్గా లోతుగా తగిలాయి. వెళ్లి అద్దం చేతిలోకి తీసుకుని దీపం వద్ద వంగి ముఖం చూసుకుంటున్నాను. నల్లగా మసక మసగ్గా అలుముకొని పోయింది.

వెరగుతో నవ్వు నాపుకుంటూ నీలి 'తప్పు. మీరు అద్దంలో ముఖం చూసుకోకూడదు' అంది.

నేనున్న పరిస్థితిలో నా మీద అధికారం కూడా చెలాయించే లాగుంది- వారెవ్వా!

'ఇల్లారా ... పోనీ నీ ముఖం చూసుకో దీంట్లో ...' అని అద్దం ఆమె కెదురుగ్గా త్రోసి వెక్కిరించాను.

'నేనెప్పుడూ అద్దంలో నా ముఖం ఎట్లా వుంటుంది అని చూసుకోను. నన్నెవరైనా క్రొత్తగా చూసినప్పుడు వాళ్ల ముఖమే నేనెల్లాగున్నానో అద్దం కన్నా స్పష్టంగా చెబుతుంది' అని వెళ్ళిపోబోతూ-

'మరి మీరు వె...ళ్లి... మళ్ళీ...బ...ళ్ళ... వా...ళ్ళ...ను...' వాక్యం మధ్యలోనే నవ్వువచ్చి తలకాయ పక్కకు త్రిప్పుకొంది. వెల్లి రెండు చేతులా ఆ యెముకల ప్రోగును గుంజి గుంజి 'నీకు మరీ ఖులాసా యెక్కువైనట్టుందేమని' అడగాలని పించింది. నాకు వెంటనే జ్ఞాపకమొచ్చింది — సృష్టికర్త ప్రకృతి కూడా వికలాంగులకు అతి తెలివి తేటల్నిచ్చి బ్రతకమంటారని.

మళ్లీ కాకులు కూయకుండానే నా గదిలోకి సిద్ధమై 'లేస్తూనే నా ముఖాన్ని మీకు చూపించ కూడదనుకున్నాను కాని ...' అంటూ దబ్బున నేలమీద చతికిలపడి నిన్న రాత్రి చిందర వందరగా గది నిండా పరిచిన సామాన్ను ఎక్కడి దక్కడ సర్దేస్తూ 'రాత్రి మీరు గొడవచేసినట్లు నేనెవ్వరికీ చెప్పలేదు. మా అమ్మకు కూడా...' అని తాను నాకు గొప్ప ఉపకారం చేసినట్లు 'చెప్పనులెండి' అంది నా వైపు చూస్తూ.

నిజంగా ముసలమ్మగారికి తెలిస్తే గోలవుతుంది. ఆ విషయం నాకు స్ఫురించనేలేదు. నీలికేసి గుడ్లప్పగించి చూస్తూ పరున్నాను. ఆ కాలు వాళ్ల అమ్మ ఆశించినట్లుగా బాగుచెయ్యగలరేమో డాక్టర్లు అని నాకూ అనిపించింది. పాపం నీకు ఆ కెంపురంగు పరికిణీ వొక్కటేనా అని అడుగుదా మనుకున్నాను.

> ఓ నిజాము పిశాచమా! కానరాదు
> నిన్ను పోలిన రాజు మాకెన్నడేని
> తీగలను తెంపి అగ్నిలో దింపినావు
> నా తెలంగాణా కోటి రత్నాల వీణ.
>
> — దాశరథి
>
> దాశరథి 1948లో నిజామాబాద్ జైలులో వున్నప్పుడు ఈ కవితను జైలు గోడపై బొగ్గుతో రాశారు.

మంచి చీరలు కొనిపెడ్తే... ఆ బొమికల ప్రోగును మార్చడం ఎట్లా... ఒక ఆరు నెలలు పండ్లు పాలూ వెన్నా పెట్టి పెంచితే, అప్పుడు మరీ లావెక్కి యింతకన్నా అసహ్యంగా వుంటుందేమో? కాస్త వంటికి కండ పట్టాక ఫరవాలేదు. చూడ్డానికి నీలి తమాషాగా వుంటుంది. మరి ఆ మిణుగురు పురుగుల్లాంటి కళ్ళు — వాటికి బంగారు ఫ్రేము కళ్ళద్దాలు తొడిగితే ముఖాన్ని కొంతవరకు కమ్ముతుంది. కొద్దిగా లిప్‌స్టిక్కు వాడాక పెదాలు దొండపళ్ళే అనిపిస్తాయి. తరువాత నో చిన్న పెట్టె బండీలో కూర్చోబెట్టి కాన్వెంటు స్కూలుకి పంపితే ... చాలా మట్టుకు మంచి అమ్మాయిల్లోనే అవుతుంది.

ఆ వుదయం నేను రైల్వే డాక్టరు దగ్గరకు వెళ్ళి 'సిక్ రిపోర్టు' చెయ్యాలి. చిక్కు మొగం వేసుకుని గుమ్మంలోని రిక్షాకేసి చూస్తూ ముఖానికి చేయి అడ్డం పెట్టుకుని ఎండలో నిలబడ్డది 'నీలి'—

'ఛా... నే నెక్కడికీ పారిపోను. నొట్టు! ఇం కెక్కడికి వెళ్తాను... మరి నా కెవ్వరూ లేరు' అని నవ్వుతూ రిక్షా యెక్కాను.

నేను తిరిగి ఆసుపత్రి నుంచి లోనికి అడుగు పెట్టేసరికి హోటలు క్రింద యేదో కొద్దిగా రభస ... పై పెదవిని దుబ్బులా క్రమ్ముకొచ్చిన మీసాలను కొరుకుతూ హోటలు యజమాని మల్లయ్య 'అబ్బ!




ARTIFICIALLY FLAVOURED. CONTAINS NO FRUIT JUICE OR FRUIT PULP. ® THE REGISTERED TRADEMARK OF PARLE (EXPORTS) PVT. LTD. BOMBAY.

నివ్వుండవే...' అంటూ గసిరాడు భార్యను. ఆవిడ ముఖంలో తుపాను వెలిసే సూచన లెక్కడా కని పించటం లేదు.

నేను చడీ చప్పుడు కాకుండా మేడమెట్లు ఎక్కుతున్నాను.

'కన్న కడుపు యివ్వాళ నాకెంత మండిపోతు న్నది? ఏమి తన కూతురేనా అప్సరస? తెలివి తక్కువతనానికి పిల్లను నాలుగు కూకలెయ్యాల్సినది పోయి తనూ వెర్రిపిల్లాడని అంటుందా? ఆ ముక్క అభిమానంగల నోట్లోంచి రావలిసిందేనా? చెప్పమనండి. యీవిడగారు యే కలకటేరో దిగివచ్చి పెళ్లాడుతాడనుకుంటోంది. కడుపులో యింతలేసి కుళ్లు ఆలోచనలున్నాయని...'

పైన నసారాలో దొప్పల్లాటి చెవులు, గ్రద్ద ముక్కు, బాకాలాటి నోరు క్రిందకు వ్రేలాడిపోతున్న లాగుతో ప్రత్యక్షమయాడు వెర్రిపిల్లాడు. నన్ను చూసి కాలెగరేస్తూ మీద మీద కురకబోతుండగా- సర్వరు 'ఇదుగో నీలి మొగుడు బాబూ-' అని లాగి పట్టుకుని 'చెప్పవయ్యా ఏది? పెళ్ళాం వచ్చాక యేం చేస్తావ్?' అన్నాడు.

సరిగా అప్పుడే నీలి తాళంచెవులు యివ్వటం కోసం టక్కుటక్కుమని చప్పుడు చేసుకుంటూ వస్తున్నది పైకి.

వెర్రిపిల్లాడు గెంతుతూ 'ఇహ్హీహీ!!' అని తప్పట్లు తరుస్తూ నవ్వుతున్నాడు.

సర్వరు 'నీలి పేరు చెబితే మురిసిపోతున్నాడు బాబూ- యిక యెంతో కాలం ఆగేట్టు కూడా లేదు' అన్నాక నీలి ముఖంలోకి చూశాను. ఎందుకో సుము ఖంగా లేదు. అన్నట్లు ఆ రోజు నెలిసిపోయిన చిన్న చిన్న పువ్వుల చీర కట్టుకుని తాటాకు బొమ్మలా ముస్తాబయింది. తలలో ఎప్పటి ఆ చిన్న ఎర్రగన్నేరు పువ్వే...

'చచ్చినాడా'- అంది సర్వరును.

వాడు ఆ పిల్లాడ్ని నీలమ్మ మీదకు వుసిగొల్పి వదిలాడు. వచ్చి వాడు వంగి, చేతిని రెండుమార్లు అర్థ చంద్రాకారంగా వూపుతూ నీలి కొంగు దొరక పుచ్చుకుని లాగాడు. సాచిన చేతిని కసుక్కుమని గిల్లటం నేను చూశాను. ఆ సాహసుడు వెంటనే మీదబడి రెండు చేతుల్తో చుట్టి వేయాలనుకున్నాడు యీ అబలను. నీలి ముఖం కంగారుతో నిండిపోయి వుంది. సర్వరు చికచికా ఫకాలుమని నవ్వుతున్నాడు. అంతే - విస్సురుగా చంకలోని క్రరతీసి కాలి మీద వేసింది. 'అమ్మో' అని యేడుస్తూ వాడు కాలు చేత్తో బుచ్చుకుని క్రిందకు దిగిపోయాడు. చూస్తుం డగా చేతిలోని క్రరను విసిరేసి గోడ మూలను దబ్బున కూలబడిపోయి చేతుల్తో ముఖం కప్పుకుని యేడువసాగింది. ఇంకా నేను వూరడిద్దామనుకునే లోపునే గాలివానలా వచ్చిపడింది మల్లయ్య భార్య.

'యేడుస్తున్నావటే పైగా చెట్టంత కుర్రాడ్ని మోకాలి ముడుసు విరిగేట్లు కొట్టి, నీ చేతులు విరగ... సిగ్గులేని ముఖమా! మేనమామ కొడుకన్న గౌరవం యేమన్నా వుందీ? నా కొడుకు కాస్త అమాయకుడు గనుక క్రర తిరగేస్తావు. అవునా?'

'అది కాదత్తా- నా చెయ్యి పుచ్చుకు లాగాడు' నీలి గొణుగుతోంది.

ఆవిడ బుగ్గలు నొక్కుకుంటూ 'ఐతే...... అందుకు తగ్గట్టే వాడు నీవేమో రంభ ననుకొని కులుకుతున్నావులే-'

'నలుగురి యెదటా మీదబడి అల్లరిచేస్తే నాకు అభిమానంగా వుంటుందత్తా' పరుషంగానే అంది చెరగు ముఖానికి కప్పుకుని కళ్ళు రుద్దుకుంటూ-

'ఐతే నా కొడుకుని నలుగురి యెదుటా క్రర పుచ్చుకు వాయించావు. నా కెంత అభిమాన ముండాలి? చెప్పుడు మాటలు వింటే బుద్ధు లిట్లాగే వంకర త్రోవలు పడ్తాయి. మిమ్మల్ని కడుపు కట్టుకొని యింతవరకూ యీడ్చుకొచ్చాక యేకు మేకవుతారని కల గన్నామా?' అని ఆమె చేతులూపుకుంటూ నిష్క్రమించింది.

ఇలా రమ్మని పిలిచాను. నీలి నెమ్మదిగా ప్రాకు కుంటూ వచ్చి గది మధ్య భాసింపట్టు వేసుకు కూర్చున్నది. పాపం! చాలా బాగా యేడ్చినదల్లే వుంది, ముఖమంతా చారికలు కట్టి వుంది.

నవ్వుతూ అన్నా 'పెళ్ళి చేసుకోమన్నారనేనా... అంత దుఃఖమూనా పోసీ-నాకుమల్లే వుండిపోతావా యే?'

'కాదండీ... చూశారా యెంతలేసి మాట అన్నదో మా అత్త. మీరు చూస్తూనే వున్నారుగా. మేమేం ఇక్కడ వీళ్ల నెత్తి మీద కూర్చుని వూరికే తింటున్నామా? మా అమ్మ నేనూ అప్పమూనా గాడి పొయ్యి దగ్గర, దాపీ దానిలా వుదయాస్త మానమూ కూరలు తరిగి, గదులన్నీ వూడిచి, కూజాల్లోకి నీళ్ళు నింపి చచ్చే చాకిరీ చేస్తుంటామే? ఎంత అనాకారిగా పుట్టినా నాకూ రెండు చేతు లంటూ యిచ్చాడుగా భగవంతుడు-'


రెండు నిముషాలు నిశ్శబ్దంగా దొర్లినమీదట, చీర చెరగు నుంచి దారప్పోగులు పెరికి లాకుతూ - 'నాకు చదువు నేర్పుతారూ?' తలకాయ వాల్చి నున్నటి గచ్చు మీద చేత్తో వ్రాస్తూ అంది.

'ఏమిటీ? చదువా...' అని ఆశ్చర్యంతో నేను రెట్టించాను. కాస్తంత సిగ్గుతో 'నాకు అక్షరాలు కూడా రావండి. చిన్నప్పుడు బళ్లోకి పంపమంటే కొట్టినంత పని చేసి మొగపిల్లాడు వాడికే లేనప్పుడు దీనికెందుకు చదువు? వూళ్ళేలాలా వుద్యోగాలు చెయ్యాలా అంటూ చాకిరీలోకి దింపేసింది మా అత్తే!'.

(ఇంకా వుంది)



# 'ప్ర'పంచ పదులు



## 45

క్యాలెండర్ చెట్టు నుంచి రాలిపడ్డ తేదీలను చదువుకో
సదస్సుల మెదళ్ళనుంచి బెదిరిపడ్డ వాదాలను చదువుకో
లోతు ముట్టి చూడందే చేతి కందబోదుసుమా ఏనిజం-
కుట్టేసిన నోళ్ళలోన నిట్టూర్చే క్రోధాలను చదువుకో
కరచాలన నటనలతో కప్పుకున్న భేదాలను చదువుకో

## 46

తాడూ బొంగరం లేక క్రీడ ఎలా చూపిస్తావు?
నారు లేక నీరు లేక పైరు ఎలా పండిస్తావు?
ఈ కబుర్ల బైర్లగాలి ఎపుడో దిగిపోయిందబ్బో-
పదం లేక స్వరం లేక పాట ఎలా పలికిస్తావు?
నిజాయితికి కట్టుపడక ప్రజల నెలా నడిపిస్తావు?

డాక్టర్ సి. నారాయణరెడ్డి